# 10

# భ్రమలో విరహం

టైప్ మెషిన్ టక టక మంటోంది.

ఫాన్లు గిరగిరా తిరుగుతున్నయ్.

అయినా గాలి రాదు.

పని తెమలదు.

చీవాట్లు ఆగవు.

అయ్యో అనుకునేందుకూ, ఊపిరిపీల్చేందుకూ వెసులుబాటు లేదు.

పని...ఒకే పని...

ఇంట్లో పని...

ఆఫీసులో పని...

తెల్లారితే పని.

పొద్దుకుంకితే పని.

దేనికి? దేనికీ ఇదంతా?

ఇంత శ్రమ దేనికీ?

కాంతాకనకాలకోసం.

ఆఫీసులో విసుగు లేకుండా పనిచేస్తే కనకం వస్తుంది.

చాలినంత కనకం చేతికి వస్తే ఇంట్లో కాంతం సరసంగా, విలాసంగా ఉంటుంది.

కాంత మంటే...

అదుగో, ఆ ఎదురుగ్గా ఉన్నదే, కొత్తగా వచ్చిన స్టెనో - ఎఱ్ఱగా, బొద్దుగా! అలా నవ్వుతూ నవ్విస్తూ ఉండాలి. ఓహ్...అట్లా ఉంటే ఎంత హాయిగా ఉంటుందీ?

సావిత్రి అట్లా ఉంటే ఎంత బాగుంటుందీ? ఎంత హాయిగా ఉంటుందీ? ఏమిటీ? సావిత్రి అందంగా లేదా? లేకపోతే ఎందుకని తను పెండ్లిచేసుకున్నాడూ? ఆనాడు, ఆ శుభముహూర్తంరోజులలో సావిత్రి అందంగానే కనిపించింది. కాదనడానికి వీలులేదు.

తను చిన్నపిల్లవాడు కాదు పెళ్ళయ్యేప్పటికి.

తన పెండ్లి బొమ్మల పెండ్లిమాదిరిగా జరగలేదు.

తను బియ్యే పాసైన తరువాతనే ఆరువేల కట్నం తీసుకునే సావిత్రిని చేసుకొన్నాడు.

ఏమో? తను చేసుకున్నాడా? నాన్న చేశాడా?

ఏమైతేనేం, ఎట్లా జరిగితేనేం - ఆ మూడు ముళ్ళూ పడ్డయ్. అంతే. ఇక తిరుగు లేదు.

సావిత్రి తన పెళ్ళాం.

తను ఆమెకు భర్త.

బియ్యే పాసైన శేషగిరి ఇంటర్ పాసైన సావిత్రి అనే యువతికి భర్త.

భర్త అయిన నాలుగు నెలల్లోనే శేషగిరి బియ్యే.

రెవిన్యూబోర్డులో టైపిస్టయినాడు. అది సావిత్రి అదృష్టం అన్నారు పెద్దలు. లిటరేచర్ పట్టభద్రుడికి రెవిన్యూబోర్డులో టైపిస్ట్ ఉద్యోగం దొరకటం అదృష్టం!

శేషగిరి ఆలోచిస్తున్నాడు. టైప్ మెషిన్ ఆగింది.

ఎదురుగా ఉన్న ఆ ఎఱ్ఱటి బొద్దు స్టెనో పెన్సిల్ పెదిమల మధ్యన పెట్టి "మిస్టర్ గిరీ!" అన్నది.

"యస్ మాడమ్" అన్నాడు గిరి.

"సూపరింటెండెంట్ పిలుస్తున్నారు మిమ్మల్ని" అన్నది మిస్ కమల.

శేషగిరి గబగబా తన సీటులోంచి లేచి హడావుడిగా తలుపు నెట్టుకొని సూపరింటెండెంట్ గదిలోకి వెళ్లాడు. నల్లటి ఖాళీకుర్చీ శేషగిరికి స్వాగతమిచ్చింది.

బిత్తరపోయి గిరి బయటికి వచ్చేప్పటికి స్టెనో కమల నవ్వుతోంది.

"ఎందుకూ నవ్వుతారూ?" అన్నాడు గిరి. ఉక్రోశంగా అని, హాలంతా కలయజూచాడు.

కుర్చీలలో ఎవరూ లేరు. అంతా వెళ్ళిపోయారు.

"అర్థమైందా మిస్టర్ గిరీ" అన్నది కమల.

"సారీ...అంత పరాచికం పనికిరాదు."

"సారీ...అవునండీ. ఇప్పుడు టైమెంత? ఇవాళ ఏప్రిల్ ఫస్ట్. మరచిపోయారా?"

"ఓ, అదా సంగతి! పదండి, వెళ్దాం. వీరాస్వామీ, తలుపులు వేసుకోవచ్చు" అంటూ గిరి బయల్దేరాడు.

ఒయ్యారంగా మిస్ కమల కూడా బయల్దేరింది.

"ఇంటికే వెళ్తారా" అన్నది స్టెనో మిస్ కమల, సెక్రటేరియట్ ఆవరణ దాటి మౌంట్‌రోడ్డుకు వెళ్ళే కాలి బాటమీద.

"అవునండీ" అంటూ గిరి పాంటుజేబుమీద చెయ్యి పెట్టి చూచుకొన్నాడు. నెలజీతం - జీతపురాళ్లు - తన శ్రమ ఫలితం ఆ జేబులో ఉన్నదని గుర్తు తెచ్చుకుని.

"కాఫీ తాగరాదూ ?"

"ఎక్కడ ?"

"కాఫీ హౌస్‌లో...డబ్బు నేనిస్తాలెండి."

"మీరా ? ఎబ్బే! ఎందుకూ ? నేనిస్తాలెండి. నేను మగవాణ్ణి కదండీ."

"అవునవును. మీరే ఇవ్వాలి. కాని, ఇవాల్టికి నేనిస్తా లెండి. ఇందాకా మిమ్మల్ని చాలా బాధపెట్టా కదూ. నేను మీకు కాఫీ ఇవ్వాలి."

ఏమి ఆప్యాయత ? ఎంతచనువు ? అదీ సంస్కారం. చదువుకున్న సంస్కారం; చదివిన ఆడదాని సంస్కారం అదేంమాట ? సావిత్రి చదువుకోలేదా యేం ? సావిత్రికి సంస్కారంలేదా ? పదేండ్లల్లో ముగ్గురు పిల్లలు పుట్టారు. అయితే అంతమాత్రానే సావిత్రిలోని మార్దవం, లాలిత్యం, హాయి అవన్నీ ఇంకి పోవాలా ?

కాఫీ కమలే కలిపింది. ఎంత బాగున్నదీ! బ్రెడ్ ముక్కలకు వెన్నరాచి చక్కెర అద్దింది. అమృత తుల్యంగా

ఉన్నవి. ఇటువంటి టిఫినే ఉంటే ఆఫీసులో ఎంత సేపైనా, ఎన్ని గంటలైనా టైప్ చేయవచ్చు ననుకొంటున్నాడు శేష గిరి బియ్యే. ఆ మరుక్షణంలోనే ఇంకో ఆలోచన.

కమల తనభార్య అయితే...

"ఏదో మూడీగా ఉన్నారు" అన్నది మిస్ కమల స్టెనో.

"ఏం లేదండీ..." అంటూనే, ఏమనుకుంటుందో అనైనా శంకించకుండా ఆమెముఖంలోకి అదేపనిగా చూస్తున్నాడు గిరి. కాఫీ తాగటం పూర్తయి పదినిమిషా లయిందని గిరికి తోచనిదే?

"ఇక వెళ్దామండీ. మా అమ్మ ఎదురు చూస్తూం టుంది," అన్నది స్టెనో మిస్ కమల. అవి మాటలా... కోకిల గానమా అనిపించింది శేషగిరికి. ఆ అయోమయంలో కౌంటరు దగ్గర మిస్ కమల డబ్బులు ఇవ్వటం, తను మెట్లు దిగి బస్సు స్టాండ్ దాకా రావడం గిరికి తెలియకపోవడం ఆశ్చర్యమా!

*
* *

ముగ్గురు పిల్లల తండ్రి శేషగిరి. రెవిన్యూబోర్డులో టైపిస్టుల హెడ్ గిరి బియ్యే. ఇంట్లో పరాకు చిత్తగిస్తు న్నాడు. సావిత్రి ముఖంకేసి అదేపనిగా చూస్తున్నాడు. దేనినిగురించో అదేపనిగా ఆలోచిస్తున్నాడు. సావిత్రి పలక రిస్తే వేమరుపాటు సమాధానా లిస్తున్నాడు. పిల్లలమీద

విసుక్కొంటున్నాడు. దేనికీ? దేనికీ? ఇదంతా దేనికీ? దీనికి కారణమేమిటా?

ఆఫీసులో మాత్రం చలాకీమనిషి మిస్టర్ శేషగిరి బియ్యే. ఎదురుగా ఎర్రటి బోర్డు 'స్టెనో మిస్ కమల' కనిపిస్తున్నంతసేపూ టైపిస్టుగిరికీ, అతని టైప్ మెషిన్‌కీ తేడా లేదు.

అభ్యున్నతిమార్గాన పురోగమించే యువకుడు మిస్టర్ శేషగిరి అనే అభిప్రాయం ఆఫీసంతా ధ్రువపడిపోతోంది. గిరి హృదయంలో మాత్రం గిలగిల. మనసులో మిస్ కమల బొమ్మ. ఇటువంటి శేషగిరి ఓ రాత్రి 'కమల' అని కలవరించేప్పటికి సావిత్రికి అబ్బాయిగారు-కాదు కాదు, పతిగారు-పట్టాలు తప్పుతున్నారని తెలియదా మరి!

తెలిస్తే మాత్ర మేం కొంప మునిగింది కనుక! భారత నారి పతివ్రత. పతియే ఆమెకు దైవం.

ధోరణి కనిపెట్టి సావిత్రికూడా గిరికి దూరంగానే మసులుకుంటోంది. సౌజ్ఞలూ, పిల్లలచేత ఖబుర్లతో ప్రశాంతంగానే బండిని నడిపిస్తోంది చదువుకున్న ఇల్లాలు సావిత్రి.

*

* *

ఆరునెలల్లో శేషగిరి అదృష్టం పండింది. సావిత్రి పుట్టింటికి వెళ్ళింది. సరిగ్గా ఆ రోజే ప్రమోషన్ ఆర్డరు వచ్చింది శేషగిరికి. ప్రమోషన్‌తోపాటు ధైర్యంకూడా వచ్చింది. ఇప్పుడు తను టైపిస్ట్ కాదు. ఓ అధికారి-డిపార్టుమెంటల్ హెడ్. ఇష్టం వచ్చినన్నిసార్లు మిస్ కమలా స్టెనోను పిలిపించవచ్చు.

కాని, విచిత్రం!

ఆ మర్నాడే మిస్ కమలా స్టెనో రెండు నెలలు మెడికల్ లీవ్ పడేసింది.

"నాన్సెన్స్..." అనుకున్నాడు శేషగిరి.

"సెలవు మంజూరు చెయ్యకపోతే..."

"పోనీ, రెకమెండ్ చెయ్యకపోతే...అబ్బే... ఇదంతా ఎందుకూ? మిస్ కమలా స్టెనో సెలవులో ఉండడమే మంచిది-వీలూ" అనుకున్నాడు శేషగిరి.

అనుకొని కమల రెసిడెన్షియల్ అడ్రస్ కనుక్కొని వేట ప్రారంభించాడు. అంత కష్టపడి వెళ్తే ఆ కిందటి రోజే మిస్ కమలా స్టెనో ఇల్లు మార్చిందని చెప్పారు ఇంటివాళ్ళు.

ఇక గత్యంతరంలేక ఆఫీసు అయిన తరువాత వారం రోజుల కొకసారి నగరంలో అన్వేషణ ప్రారంభించాడు.

ఈ అన్వేషణలో, కొత్తఉద్యోగం మోజులో రెండు నెలలు దాటిపోయినవనీ, రేపో మాపో సావిత్రి వస్తుందనీ మిస్టర్ గిరి బిత్యే మరచిపోయి ఓరోజు సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి పరాకుగా బయల్దేరాడు. ఏమిటో... ఇదంతాయేమిటో...తన బుద్ధి ఇట్లా మారిందేమిటో...

సావిత్రికన్న కమల ఏమంత అందంఅయిందేమిటి? పెండ్లికాలేదు. చేసిపెట్టేందుకు అమ్మ ఉన్నది. తను సంపాదిస్తోంది. ఆరోగ్యంగా, అందంగా, హాయిగా కమల కనిపించటంలో ఆశ్చర్యమేమిటీ అనుకొంటూ నడుస్తున్న గిరికి బస్టాండ్ దగ్గర కమలవంటి యువతే నుంచొని

ఉండడం కనిపించి గబగబా నడకసాగించాడు. బస్ స్టాండు దగ్గరికి వెళ్ళేప్పటికి ఆ అమ్మాయి - కాదు, యువతి-కూడా నడక ప్రారంభించింది. ముందు ఆ అమ్మాయి నడుస్తోంది. ఎవరైనా చూస్తే బాగుండదని కొంచెం దూరంగా గిరి నడుస్తున్నాడు. నడిచి నడిచి ఆ అమ్మాయి సరిగ్గా తన ఇంటి వీధిలోకే వెళ్తోంది. కమలే అయిఉంటుంది. తప్పకుండా కమలే అయిఉంటుంది. అదే చీర. గులాబీరంగు చీర. సరిగ్గా అట్లాగే జడవేసుకుంది. అవిగో అవే రోజూ ఆఫీసులో తను చూచిన చెప్పులు. కమల తనకోసమే బయలుదేరి ఉంటుంది. పోనీ, పిలుస్తే! ఛా...రోడ్డుమీద పేరుపెట్టి పిలచి నిలవేసి మాట్లాడడం ఏం బాగుంటుందీ! అదుగో సరిగ్గా తన ఇంటిదగ్గరే ఆగింది. లోపలికి వెళ్తోంది. కొంపతీసి తలుపుతాళం వేసిఉన్నదని తిరిగి వెళ్ళదుకదా అనుకొంటూ శేషగిరి ఉరకలు వేస్తున్నాడు.

అయ్యయ్యో! ఎంత పొరపాటు! ఈ హడావుడిలో ఓ పూలదండో, లేకపోతే ఓ పండో అయినా కొనలేదే అనుకొంటూ శేషగిరి తను కాపురంవుంటున్న ఇంటి ముందుకు వచ్చేప్పటికి "మీా కోసం ఎవరో వచ్చారు" అన్నాడు ఇంటివాళ్ళ అబ్బాయి.

"రా అన్నయ్యా...రాత్రి బండికి నేనూ, వదినా వచ్చాము, వదినే పిల్లలూ అక్కడున్నారు. నిన్ను పిలుచుకు వెళ్దామని వచ్చాను." అన్నది గిరిపింతల్లి కూతురు సీత.

శేషగిరి ముఖం వివర్ణమైంది. తల తిరిగిపోయింది.

అయినా అదంతా ఏమీ కనపడనివ్వకుండా చెల్లెలి వెంట వాళ్ళఇంటికి వెళ్ళాడు. ఆ రాత్రి బావమరది చాలా మర్యాదచేశాడు. బావమరదితోపాటు ఇంకో యువకుడు - కొత్తపెళ్ళికొడుకల్లే దర్జాగా కూర్చున్నాడు.

"వీడు మా పెత్తండ్రి కొడుకు. మా అన్నయ్య. మొన్ననేపెళ్ళిఅయింది. ఈవూళ్లో వాడిభార్యకు ఉద్యోగం" అన్నాడు బావమరది.

"వారి ఆఫీసులోనే అనికూడా చెప్పకపోయినావ్" అన్నది అంతలోనే సావిత్రి అందుకొని.

"హల్లో మిస్టర్ గిరీ" అంటూ కిలకిలా నవ్వుతూ వచ్చిన కమల శేషగిరికి చాలా మోటుగానూ, పదిమంది ఆడవాళ్ళల్లో ఒక తెగానూ కనిపించింది. కొత్త పెళ్లికూతురులా కనిపించింది సావిత్రి శేషగిరికళ్ళకు.